
కుమ్మరి వీధిలో..


బుధవార పేటలో..


లలితా పీఠంలో..


వడ్డెగేరిలో..


నన్నూరు సరస్వతి ఆలయంలో..


సత్యసాయి మందిరంలో..


వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో..


కల్లూరు చౌడేశ్వరి దేవి ఆలయంలో..

మమ్మేలమ్మా.. మహాలక్ష్మి


కల్లూరు చౌడేశ్వరి దేవి ఆలయంలో..


లలితా పీఠంలో అయ్యప్పస్వామి భజన

కర్నూలు కల్చరల్: దసరా శరన్న వరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రులపై ప్రవచనాలు జరిగాయి. పెద్దమ్మవారి శాలలో చండిక దేవిగా, కల్లూరు చౌడేశ్వరీ దేవి ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా, వన్‌టౌన్ గీతా మందిరంలో సింహ వాహినిగా, చిన్న అమ్మవారి శాలలో అష్టలక్ష్మిగా, కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, నన్నూరు సరస్వతీ దేవి ఆలయం, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం, నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయం, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయం, బుధవారపేట కాళికాంబ ఆలయం, బండిమెట్ట అంబా భవాని ఆలయంలో, చిన్మయ మిషన్, గంగా మాత దేవాలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, ఆరోరా నగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో 12 గంటల పాటు ఏకధాటిగా అయ్యప్ప స్వామి భజనలు చేశారు.




సప్తగిరి చౌడేశ్వరీ దేవి ఆలయంలో...పెద్దమ్మవారి శాలలో...చాణిక్యపురి కాలనీలో బొమ్మల కొలువు


సప్తగిరి చౌడేశ్వరీ దేవి ఆలయంలో..


ఇస్కాన్‌లో..

క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న మెప్మా ఆర్పీలు

కర్నూలు(సెంట్రల్): మెప్మా ఆర్పీలకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె పీడీకి వినతిపత్రం ఇచ్చారు. చిరుద్యోగులైన ఆర్పీల వేతనాలను పెండింగ్‌లో ఉంచితే వారి కుటుంబాల ఇబ్బందులు ఎలా ఉంటాయో ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు రుద్రమ్మ, కోశాధికారి సుజాత, ఉపాధ్యక్షురాలు నాగమణి, నాగేశ్వరి, జ్యోతి, సంధ్యారాణి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం న్యూసిటీ కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నగర అధ్యక్షుడు ఎస్.మాబాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలకు దేశంలోని అన్ని రంగాల కార్మిక వర్గ నాయకులు రాబోతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీకి జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆర్.నరసింహులు, సుధాకరప్ప, రహిమాన్, జానకీరామ్, లక్ష్మన్న, దాసప్ప పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): పట్టణాలోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని వెంటనే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఇంటి స్థలాల సాధన సమితి సమావేశాన్ని నగర కన్వీనర్ రజియా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఒక్కరికి కూడా ఇంటి స్థలం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వంపై పోరాటం చేసైనా సాధించుకోవడానికి పేదలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, మహేస్, నాగరాజు, అన్వర్, నల్లన్న, బీసన్న, ఈశ్వర్ పాల్గొన్నారు.

బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక


పుల్లా రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: సి.బెళగల్ మండలం పాలకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ బాల సాహితీవేత్త పుల్లా రామాంజనేయులును సింహ ప్రసాద్ సాహిత్య సమితి వారి డాక్టర్ వేదగిరి రాంబాబు బాల సాహిత్య పురస్కారం-2025కు ఎంపిక చేసినట్లు సమితి కన్వీనర్ సింహ ప్రసాద్ పేర్కొన్నారు. అక్టోబర్ 14న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే సభలో తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారు కె.వి.రమణాచారి చేతుల మీదుగా పురస్కార ప్రదానం ఉంటుందని తెలిపారు. పురస్కారం కింద రూ.5 వేలు నగదు, మెమొంటోతో పాటు ఘన సత్కారం ఉంటుందని పేర్కొ న్నారు. పురస్కారానికి ఎంపికైన రామాంజనేయులుకు పలువురు సాహితీ వేత్తలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఈతకు వెళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త!

కర్నూలు: దసరా సెలవుల నేపథ్యంలో యువకులు, విద్యార్థులు ఈతకు వెళ్లడం వల్ల ప్రమాదకర ఘటనలు జరిగే అవకాశమున్నందున జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని గ్రామాలు, పట్టణ శివారులో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాల్వలు పూర్తిగా నిండిపోయాయని, తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నదీ తీర ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా, ఏవైనా సమస్యలు ఉంటే 112కు డయల్ చేసి సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆపదలు, అత్యవసర పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలు, ఏ సమస్య అయినా 112కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని కలిసిన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): నాలుగవ తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఆ సంఘం నేతలు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని కోరారు. శుక్రవారం కలెక్టర్‌ను ఆమె చాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి మాట్లాడుతూ.. వివిధ శాఖల్లో 4వ తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అధ్యక్షుడు మద్దిలేటితో పాటు నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బి.గోపి, నాగరాజు, జిల్లా నాయకులు ఫయాజ్‌బాష, డీఎండీ షబ్బీర్ తదితరులు ఉన్నారు.

జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నిర్మల

ఓర్వకల్లు: అమ్మకం పన్ను(జీఎస్‌టీ) తగ్గుదలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నిర్మల అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో జరిగిన వేర్వేరు సమావేశాల్లో నిర్మల మాట్లాడుతూ జీఎస్టీ అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న నాలుగు స్లాబ్‌లను తగ్గించి రెండు స్లాబ్‌లకు తీసుకొచ్చిందన్నారు. దీని వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నిత్యజీవితంలో వినియోగించే వస్తువుల ధరలు తగ్గాయన్నారు. జీఎస్టీ సంస్కరణ ప్రయోజనాలను తెలియజేయడానికి సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ నినాదంతో సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన గ్రామస్థాయిలో, అక్టోబర్ 4,5 తేదీల్లో మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కార్యాలయ సిబ్బంది సుధీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి ఆభరణాల విరాళం

మద్దికెర: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో కొలువైన పార్వతిదేవికి గుంతకల్లు పట్టణానికి చెందిన సుంకు పంపావతి జ్ఞాపకార్థం భార్య సుంకు శారద, కుమారుడు ఇందీష్ రూ.లక్ష విలువజేసే కాసుల హారం, జడపట్టు, కుచ్చుల బంగారు ఆభరణాలను శుక్రవారం అందజేశారని ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. అనంతరం ఆభరణాలను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు ప్రసాదం అందజేశారు.

దళితులపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం



ర్యాలీ పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

కర్నూలు(సెంట్రల్): దళితుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కులాల మధ్య చిచ్చు పెట్టి చోద్యం చూస్తోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. ఆగస్టు 3న కుప్పంలో ప్రారంభమైన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శుక్రవారం కర్నూలుకు చేరుకుంది. ఈ క్రమంలో కర్నూలులో అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టిన పాదయాత్రలో చింతామోహన్ పాల్గొని ప్రసంగించారు. ఏపీలో సీఎం చంద్రబాబు కులాల మధ్య చిచ్చుపెట్టి విభజించు.. పాలించు సూత్రాన్ని అమలు చేస్తున్నారని, ఎస్సీలందరూ గమనించి ఐక్యంగా ఉండాలని సూచించారు. అయితే చంద్రబాబు ఎస్సీలపై ప్రేమను ఒలకబోయడం చూస్తే నవ్వొస్తుందన్నారు. కారంచేడు మారణ హోమానికి బలైన మాదిగలను చంద్రబాబు ఏనాడైనా పరామర్శించారా అని ప్రశ్నించారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగం అవహేళనకు గురవుతోందని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు మాట్లాడారు. ఎస్సీ నాయకులు అశోక్‌రత్నంతో పాటు పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

ఐలమ్మ జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి


చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీ రజకవృత్తిదారుల సంఘం

కర్నూలు(అర్బన్): తెలంగాణ సాయుధ భూపోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని రజక సంఘం నేతలు కోరారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక నేతలు వేంపెంట రాంబాబు, వాడాల నాగరాజు మాట్లాడుతూ.. రజాకార్ల దురాగతాలపై ఐలమ్మ వీరోచితమైన పోరాటాలు చేశారన్నారు. ఆమె జీవితం, ఉద్యమ ప్రయాణం నేటి యువతకు ఆదర్శమన్నారు. భూపోరాటంలో ఆమె చేపట్టిన ఉద్యమాలు తెలంగాణలో ఎంతో మంది ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రజక సంఘాల నేతలు కేతురు మధు, శ్రీనివాసులు, సింగారం రంగా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తామని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్, న్యూసిటీ కార్యదర్శి శేషాద్రి, ట్రెజరర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం రజకవృత్తిదారుల సంఘం కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదోనికి భక్త కనకదాసు జిల్లాగా పేరు పెట్టాలి


మాట్లాడుతున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): నూతన జిల్లాగా ఏర్పడనున్న ఆదోనికి శ్రీ భక్త కనకదాసు జిల్లాగా పేరు పెట్టాలని కురువ సంఘం నేతలు కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఆదోనికి కనకదాసు జిల్లాగా పేరు పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులందరినీ స్వయంగా కలిసి కోరతామన్నారు. కురువ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీలీలమ్మ, అనిత,సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇవ్వాలని జేసీ బెదిరించడం తగదు

కర్నూలు(సెంట్రల్): ఆలూరు మండలం మనేకుర్తి గ్రామ రైతులను పవర్‌గ్రిడ్ ప్రాజెక్టు కోసం భూములు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య బెదిరించడం న్యాయం కాదని, బలవంతంగా భూసేకరణ చేస్తే అన్నదాతల నుంచి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సారవంతమైన 195 ఎకరాలను బలవంతంగా ఇవ్వాలనడం భావ్యం కాదన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో 90 శాతం మంది రైతులు వ్యతిరేకించినా భూమలు ఇవ్వాలని బెదిరించడం అన్యాయమన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 80 శాతం మంది రైతులు అంగీకరిస్తేనే ప్రాజెక్టుల కోసం భూములు తీసుకోవాల్సి ఉంటుందని, ఆ విషయాన్ని జేసీ తెలుసుకోవాలన్నారు.

రేపు వరల్డ్ హార్ట్ డే

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులో ఈ నెల 28వ తేదీన జరగనున్న వరల్డ్ హార్ట్ డే వేడుకలను జయ ప్రదం చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2002 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2011లో కర్నూలు హెల్త్ క్లబ్ స్థాపించి ప్రతి నెలా వైద్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ యేడాది వరల్డ్ హార్ట్ డే సందర్భాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌కు చెందిన కార్డియాలజిస్టు డాక్టర్ ప్రతాప చంద్రకు అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరవుతున్నట్లు తెలిపారు.

కేసీలో గల్లంతైన విద్యార్థి కోసం గాలింపు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని ఎస్‌ఏపీ సీఆర్ఆర్ మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు గల్లంతు కావడం బాధాకరమని, అందులో ఒక్క విద్యార్థి మరణించడం, మరో విద్యార్థి ఆచూకీ లభించకపోవడంతో కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థి ప్రశాంత్ కోసం గాలింపు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. చనిపోయిన విద్యార్థి అశోక్ కుటుంబానికి ఆమె సానుభూతి తెలిపారు.

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

కర్నూలు కల్చరల్: జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 45వ ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు డాల్ కింగ్ మోహన్ బాబుచే ప్రత్యేక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళి

కర్నూలు(సెంట్రల్): ఆర్థిక సంస్కరణల రూపశిల్పి డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని, ఆయన దేశానికి ప్రధానమంత్రిగా, ఆర్థికమంత్రిగా అందించిన సేవలతో దేశం వృద్ధి పథంలోకి వచ్చిందని ఏఐసీసీ మెంబర్ మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ 93వ జయంతి కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా తెచ్చిన సంస్కరణలతో దేశ వృద్ధి రేటు పెరిగిందన్నారు. నాయకులు సయ్యద్‌ఖాద్రిపాషా, బతుకన్న, బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, బి.సుబ్రమణ్యం,నాగన్న, జమ్మన్న, మారెన్న పాల్గొన్నారు.

28న గుర్రం జాషువా జయంతి

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు పద్మభూషణ్ మహా కవి గుర్రం జాషువా జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ప్రముఖుల ఉపన్యాసాలు, కళాకారులచే జాషువా రచించిన పద్యాలు, గేయాలాపన ఉంటుందని పేర్కొన్నారు.

రుణాల మంజూరులో లక్ష్యాలు సాధించాలి


మాట్లాడుతున్న కలెక్టర్


హాజరైన బ్యాంకు అధికారులు

- అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టర్మ్ లోన్లు ఇప్పించడంలో పురోగతి ఉండాలి
- బ్యాంకర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

కర్నూలు (సెంట్రల్): పంట రుణాల మంజూరులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకర్లతో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించడంలో భాగంగా లోన్ల మంజూరులో పురోగతి చూపాలని ఆదేశించారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టర్మ్ లోన్ల మంజూరులో పురోగతి తక్కువగా ఉందని, కోల్డ్ స్టోరేజ్, రూరల్ గోడౌన్ లాంటి ప్రతిపాదనలు ఉంటే బ్యాంకు అధికారులకు పంపాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. సీసీఆర్సీ కార్డుదారులకు రుణాలు ఇవ్వాలని, పశుసంవర్ధక శాఖకు సంబంధించి లైవ్‌స్టాక్ లోన్లు ఎక్కువ మందికి ఇప్పించాలన్నారు. టిడ్కో గృహాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యా రుణాల మంజూరులో బ్యాంకర్లు శ్రద్ధ తీసుకోవాలన్నారు. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ శిక్షణ కేంద్రం ద్వారా స్వయం ఉపాధి కల్పనకు ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కెనరా బ్యాంకు ఆర్‌ఎం సుశాంత్‌కుమార్, ఎల్‌డీఎం రామచంద్రరావు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ రామకృష్ణ, యూనియన్ బ్యాంక్ ఆర్‌ఎం నరసింహారావు, డీఏఓ వరలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ రమణ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజా మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సభలో బాలయ్య వ్యాఖ్యలు సిగ్గుచేటు



వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శివారెడ్డి

కర్నూలు (టౌన్): అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రవర్తన, వ్యాఖ్యలు సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవిని అవమానించేలా అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన తీరు అత్యంత దురదృష్టకరమన్నారు. హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్న బాలకృష్ణ కనీసం ఒక్క రోజైనా నియోజకవర్గ సమస్యలు గురించి మాట్లాడారా? అని ప్రశ్నించారు. గతంలో బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిగినప్పుడు వైఎస్సార్ రాజకీయంగా ఆలోచించి ఉంటే, ఈ రోజు చేతులు జేబులో పెట్టుకొని నోటికొచ్చినట్లు మాట్లాడేవారా? అన్నారు. మానసిక స్థితి సరిగా లేదని సర్టిఫికెట్ తెచ్చుకున్న బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని, నిత్యం వైఎస్ జగన్‌పై ఏడుపు మానుకోవాలని హితవు పలికారు.

తిమ్మందొడ్డిలో చోరీ కేసు నమోదు

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో ఒక ఇంట్లో జరిగిన దొంగతనంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ తెలియజేస్తూ.. తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన చెన్నా రెడ్డి ఇంట్లో గురువారం గుర్తు తెలియని దుండగులు చొరబడి బంగారు, వెండి ఆభరణాలను దొంగలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడున్నర తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసి, విచారణ చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై ఉదాసీనత వీడండి


మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలో అక్రమ నిర్మాణాలపై ఉదాసీన వైఖరి వీడాలని నగరపాలక కమిషనర్ స్పష్టం చేశారు. అక్రమ భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. శుక్రవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ప్లానింగ్ సిబ్బందితో కలిసి కమిషనర్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి సచివాలయం పరిధిలో సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, ఇతర కార్యదర్శుల సహాయం తీసుకొని అక్రమ నిర్మాణాలు గుర్తించాలన్నారు. ఇళ్లకు అప్రూవల్ ఉందా.? ప్లాన్ విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారా..? అనే అంశాలను నిశితంగా పరిశీలించాలన్నారు. అనధికారిక లేఔట్ల క్రమబద్ధీకరణ పథకంపై క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డీసీపీ వెంకట రమణ, టీపీఎస్ అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.